క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆర్మూర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఆర్మూర్: వాహనదారులు వాహనాల ధ్రువ పత్రాలను వెంట కలిగి ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలతో గురువారం విస్తృతంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 20 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను వివరించారు.

సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలి



చెక్కు అందజేస్తున్న డీజీబీ మేనేజర్

వేల్పూర్: మహిళా సంఘాలు సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలని రామన్నపేట్ దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ చంద్రకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని మహిళా సంఘాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి రూ. 150,000 పీఎంఎఫ్ఎంఈ రుణం చెక్కును గురువారం అందజేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బత్తుల మాణిక్యం, సీసీలు ప్రకాశం, సాయన్న, గ్రామసంఘం అధ్యక్షురాలు, వీవోఏలు మాణిక్‌రావు, కవిత పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో ఎల్లవ్వ అనే మహిళ మంత్రాలు చేస్తుందనే అనుమానంతో కొందరు వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు అరుణ

ఆర్మూర్ : ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న 18 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ప్రతి గురువారం భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, సీజీవీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ

ఆర్మూర్ : ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నాలుగు సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ గురువారం తెలిపారు. వివిధ ప్రాంతాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదుల మేరకు వీటిని రికవరీ చేశామన్నారు. బాధితులైన నవీన్, శ్రీనివాస్, మల్లయ్య, విజయ్‌లకు సెల్ ఫోన్లను ఎస్‌హెచ్‌వో అందజేశారు.

ఉచిత కంటి పరీక్షల సేవలను విస్తృతం చేయాలి

ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ పంపాటి నగేష్ సూచించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సమావేశంలో క్లబ్ డిస్ట్రిక్ సెక్రెటరీ శ్రీధర్, ప్రతినిధులు నరసింహారాజు, చార్టర్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, గంగారెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

'ట్రంప్ చర్యలను ఖండించండి'

ఆర్మూర్ : భారత పౌరులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నిఖిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా కార్యదర్శి మమత, ఉపాధ్యక్షుడు వినోద్, సహాయ కార్యదర్శి సిద్దు, నాయకులు సాయి రాజ్, అరుణ్ తదితరులున్నారు.

నిలిచిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం

- మండల పరిషత్ నుంచి రూ. 5 లక్షలు కేటాయింపు
- ఇబ్బందులు పడుతోన్న ప్రజలు



అసంపూర్తిగా ఉన్న పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులు

బాల్కొండ : మండల కేంద్రంలో నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. బాల్కొండ మండల పరిషత్, తహసీల్దార్, పోలీసు, మైనర్ ఇరిగేషన్ కార్యాలయాలు అన్ని ఒకేచోట ఉన్నాయి. దీంతో నిత్యం వివిధ పనులపై మండల కార్యాలయాలకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం మండల పరిషత్ నుంచి రూ.5 లక్షల నిధులను టాయిలెట్ల నిర్మాణం కోసం కేటాయించారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి స్లాబ్ వరకు చేసి వదిలేశారు. పనులకు ఎంబీ రికార్డు చేసిన ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను ఏడాది క్రితం నిలిపివేశాడు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చేసిన పనులకు బిల్లు చెల్లిస్తేనే పనులు తిరిగి ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ పేర్కొంటున్నాడు. టాయిలెట్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలని సూచించాం

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం మండల పరిషత్ నుంచి రూ. 5 లక్షల నిధులను మంజూరు చేశాం. బిల్లులు వస్తాయని పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. – విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో, బాల్కొండ

ఫిష్ మార్కెట్లు మంజూరు చేస్తాం

- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్
- ఆర్మూర్‌లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



ఆర్మూర్‌లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న మెట్టు సాయికుమార్

ఆర్మూర్ : రాష్ట్రంలో ఫిష్ మార్కెట్ లేనిచోట మంజూరు చేస్తామని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఆర్మూర్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించుకుందామన్నారు. పట్టణంలో ఆర్మూర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గంగమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు గంగపుత్రులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టే గంగపుత్రుల కోసం ప్రత్యేక ఆరోగ్య భద్రత పథకం తీసుకొచ్చి ఇన్సూరెన్స్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీ.వినయ్ రెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలి

వర్ని : గ్రామపంచాయతీ కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గుర్తింపు కార్డులు, బూట్లు, సబ్బులు, నూనె, యూనిఫారం, పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిచో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నన్నే సాబ్, యూనియన్ మండలాధ్యక్షులు సాయిలు, కార్యదర్శి లింగం, కోశాధి కారి రాజు, ఉపాధ్యక్షులు సాయిచరణ్ పాల్గొన్నారు.



వర్నిలో ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యం



నందిపేటలో బారసాల నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు

నందిపేట్(ఆర్మూర్): ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని జిల్లా బాలల పరిరక్షణ అధికారి నాగెల్లి బాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలలో భాగంగా బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహలతో కలిగే నష్టాలు, పిల్లల అక్రమ నివారణ, చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం వంటి అంశాలను వివరించారు. డీహెచ్ఈడబ్ల్యూ అధికారి పుష్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేఖ, అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలి

ఆర్మూర్: తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ ఆటోల్లో వేయాలని ఆర్మూర్ మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ సూచించారు. పట్టణంలోని 3వ వార్డులో మహిళలకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్, మున్సిపల్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సబ్‌స్టేషన్‌లో వీసీబీ ప్రారంభం



వీసీబీ ప్రారంభించిన విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్

వేల్పూర్: మండలంలోని రామన్నపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా బిగించిన వోల్టేజ్ కంట్రోల్ బ్రేకర్‌ను విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీసీబీ ఏర్పాటు చేయడంతో సబ్‌స్టేషన్ పరిధిలో వోల్టేజి హెచ్చుతగ్గులు కలిగినప్పుడు వ్యవసాయ పంపుసెట్లకు, గృహవిద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ డీఈఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ లోకనాథ్‌రెడ్డి, మోర్తాడ్ ఏఈ, సబ్ ఇంజినీరు గంగాధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, లైన్‌మెన్ సతీష్ ఉమార్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్‌లో ఉర్సు ప్రారంభం



రుద్రూర్‌లో ఉర్సు ఊరేగింపు

రుద్రూర్ : మండల కేంద్రంలో జమాలోద్దీన్ జనేమన్ జన్నతి ఉర్సు గురువారం ప్రారంభమైంది. గుర్రంపై నైవేద్యం ఉంచి ప్రధాన వీధుల ద్వారా ఊరేగింపు నిర్వహించారు. దర్గా వద్ద పూల్ చాదర్ సమర్పించారు. సాయంత్రం ప్రారంభమైన ఊరేగింపు రాత్రి వరకు కొనసాగింది. గ్రామంలో గత 29 ఏళ్లుగా రెండు రోజులపాటు ఉర్సు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు వంజరి గంగాధర్ అలియాస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అన్నదానం, సాయంత్రం కవాలి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ఆంధ్రానగర్ గ్రామంలో చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని ఆంధ్రానగర్, సీహెచ్ కొండూర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఆంధ్రానగర్ గ్రామానికి చెందిన సత్తెన్నపల్లి సుమతికి రూ.60 వేలు, సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన బొండ్ల సుజాతకు రూ.32 వేల మంజూరైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మందమహిపాల్, నాయకులు దేవిదాస్‌గౌడ్, పోశెట్టి, సంజీవ్, అడవి రాము, దమ్మాయి శ్రీను కాంతం, చిన్నయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో శివకృష్ణ

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకునుగుణంగా విధులు నిర్వహించాలని డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డివిజన్‌కు సంబంధించిన సాధారణ మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణను ఈసీ మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ ఈక్విటీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు విద్యార్థులకు ఈమెయిల్ ఐడీ క్రియేట్ చేయడం, గూగుల్ టూల్స్, గూగుల్ ఫర్ ఇన్ఫర్మేషన్, ఇంటర్నెట్ ఎథిక్స్ అండ్ సెక్యూరిటీ, గూగుల్ డాక్యుమెంట్స్, గూగుల్ సైట్స్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకట రమణ చారి, రాజ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బోధన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోధన్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కర్నాటి యాదగిరి సంతాప సభను ఈ నెల 17న నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ ప్రాంతంలో సంతాప సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంతాప సభకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.పార్టీ నాయకులు పడాల శంకర్, సాయిలు, గంగాధర్, పోశెట్టి, భూమయ్య, రాములు, బాలయ్య, చిన్నయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : ఈనెల 17న నిజామాబాద్‌లో జరిగే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు కర్నాటి యాదగిరి సంతాప సభ వాల్ పోస్టర్లను లక్కోర గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు జి.అరవింద్, ఇ. రమేశ్, గంగాధర్, లింబాద్రి, అన్వర్, ఆనంద్, రాజేందర్, సాయన్న, హేమలత, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి



మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆర్మూర్ సభ్యులు

బాల్కొండ: ముప్కాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజిని నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. స్త్రీ అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు. హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సరోజిని నాయుడు జయంతిని నిర్వహించారు. ఆర్మూర్ క్లబ్ అధ్యక్షుడు పొల్కం వేణు ఆధ్వర్యంలో పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మహిళా కానిస్టేబుళ్లను ఘనంగా సన్మానించారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, క్లబ్ రీజనల్ చైర్మన్ డీకే రాజేష్, జోన్ చైర్మన్ చేపూర్ గణేష్, క్యాషియర్ అశోక్, సభ్యులు ప్రకాష్ గుజరాతి, నివేదన్, రాజేశ్ తదితరులున్నారు.

ముగిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎడపల్లి : మండలంలోని జానకంపేట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా కుస్తీ పోటీలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్	షోలు
స్క్రీన్-1	నిదురించు జహాపనా(తెలుగు)-12.55; లైలా (తెలుగు)- 3.30 9.00; బ్రహ్మానందం(తెలుగు)-6.10; చావా(హిందీ)-9.15
స్క్రీన్-2	కెప్టెన్ అమెరికా - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3	లైలా (తెలుగు) -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-4	తండేల్(తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్	షోలు
స్క్రీన్-1	చావా (హిందీ)-11.00 1.45 4.40 7.35 10.30
స్క్రీన్-2	లైలా - 1.30, 7.30
స్క్రీన్-3	బ్రహ్మానందం (తెలుగు)-11.00, 1.40, 4.30, 7.20, 10.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్	షోలు
స్క్రీన్-1	కెప్టెన్ అమెరికా - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	చావా (హిందీ) - 10.05 1.15 4.25 7.35 10.45
స్క్రీన్-3	తండేల్ (హిందీ) - 10.15; నిదురించు జహాపన - 1.00, 7.20; చావా (హిందీ) - 4.05, 10.25
స్క్రీన్ -4	తల (తెలుగు) - 10.00, 7.10; సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 1.15, 10.25; బ్రహ్మానందం (తెలుగు) - 4.00

థియేటర్	షోలు
లలితామహల్	తండేల్(తెలుగు)-11.00, 2.00, 6.00, 10.00
దేవి	లైలా (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
నటరాజ్	చావా (హిందీ)-11.00, 2.00, 6.00, 10.00
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	81,492		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

సంక్షిప్తం

ధ్రువ నారాయణను ఆదర్శంగా తీసుకోవాలి

ఆర్మూర్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు ధ్రువ నారాయణను ఉద్యమకారులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ.ప్రభాకర్, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బీ.దేవరాం సూచించారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో గురువారం ధ్రువ నారాయణ మృతికి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు.మాస్‌లైన్ నాయకులు ముత్తన్న, కిషన్, నిఖిల్, రాజన్న, శేఖర్, సత్తెమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గబాళే మాధవ్ (86)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. అతను ఈనెల 11న ఇంటి నుంచి బయటికు వెళ్లి తిరిగిరాలేదు. పలుచోట్ల గాలించిన ఆచూకీ లభించకపోవడంతో గురువారం కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఎడపల్లి(బోధన్): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష పడినట్లు ఎస్సై వంశీ చందర్ రెడ్డి తెలిపారు. బోధన్ రూరల్ మండలం కల్దుర్కి, సిద్ధాపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు ఈ నెల 5, 6న ఎడపల్లిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. గురువారం వీరిని బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్పసాయి ఎదుట హాజరు పర్చగా ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బోధన్ పట్టణానికి చెందిన వ్యక్తికి..

బోధన్‌టౌన్(బోధన్): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ.. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా పట్టణంలోని నాయిబ్రాహ్మణ కాలనీకి చెందిన శ్రీనివాస్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి గురువారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషసాయి తల్ప ఎదుట హాజరు పరుచగా ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారని వెల్లడించారు.

యువతకు ఆదర్శం

ఆర్మూర్ : జాతీయ స్థాయిలో భారత సేవ రత్న అవార్డు గ్రహీత, సమాజ సేవకుడు పట్వారి తులసి కుమార్ యువతకు ఆదర్శమని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం గవర్నర్ పంపాటి నగేష్ అభినందించారు. ఆర్మూర్ పట్టణంలో గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కార్యదర్శి శ్రీకాంత్, అంబల్ల తిరుపతి, రఫీ, రవి తదితరులున్నారు.

కుల గణన పూర్తి స్థాయిలో చేపట్టాలి

బాల్కొండ: బీసీ కుల గణన రీ సర్వేను పూర్తి స్థాయిలో చేపట్టాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తామన్నారు.

నేడు శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

బాల్కొండ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.